## 33. పందిట్లో పెళ్లవుతున్నది

ట్రాఫిక్ సిగ్నల్ లేక స్కూటర్ ఆపిన సమయంలో ఆర్.టి.సి. కాంపెక్స్ జంక్షన్ దగ్గర ముందుగా చప్పట్లు కొట్టి, దానికి నేను చలించక పోయినందువల్ల నా పేరు పెట్టి పిలిచీ ఆపిన మనిషిని నేను వెంటనే గుర్తుపట్టలేకపోయాను. అయితే అతగాడు నా దగ్గిరిసా వొచ్చి "గుర్తు పట్లేదా? నేను, జగన్మోహనరావుని. విజయనగరం." అనగానే జ్ఞాపకం వొచ్చి బండి దిగాను. సరిగ్గా ఆ క్షణంలో పచ్చదీపం వెలిగింది. కాని ఇరవై ఏళ్ల తరవాత కనబడిన పాత పరిచయస్తుణ్ని ఒక్క మాటతోనయినా పలకరించకుండా వెళ్లిపోడం ఇష్టంలేక స్కూటర్ పక్కకి లాగి స్టాండు వేశాను.

"బావున్నావా?" అన్నాడు.

"ఆ, ఏదో, ఏదో; అలాగ."

"ఇంతకీ నేనెవరో గుర్తొచ్చేనా?"

"ఆ జగన్మోహనరావువి, విజయనగరం. మనిద్దరం చదువుకునేటప్పుడు ఒకే హోటల్లో భోజనాలు చేసేం. ఇప్పుడెక్కడుంటున్నావు?"

"విజినారంలోనే. ట్యుటోరియల్ కాలేజి పెట్టేను."

"ఏమిటి, ఇలా వొచ్చేవు?"

"మనతో చదువుకున్నాడు కదా, అచ్యుతరామయ్య! అతని కూతురికి ఈ రాత్రి పెళ్లి. ఇప్పుడే బస్సుదిగేను."

"అరె! నేనూ అక్కడికే వెళ్తున్నాను. బండెక్కు, పోదాం!"

పావుగంటలో కల్యాణమంటపానికి చేరుకున్నాం. రికార్డుల మోతతో ఆ పేట పేటంతా అదిరిపోతోంది.

"ఛ! వీడిక్కూడా అభిరుచి కాపాడుకోడం తెలీలేదు." అని విసుక్కున్నాడు జగన్మోహనరావు.

"ఏమిటలా అనేస్తున్నావు? ఇంకా మనం అచ్యుతరామయ్యని కలవనే లేదు. నువ్వేమో అతన్ని చూసి కూడా పదిహేనేళ్లు దాటిందంటున్నావు." అన్నాను ఆశ్చర్యపడి.

"ఆ పాట విను!" అని లౌడ్ స్పీకర్ వేపు చూపించేడు.

"పాడు జీవితమూ, యవ్వనం, మూడునాళ్ల ముచ్చటలోయి, అయ్యయ్యో నీదు పరుగులెచటి కోయి-?" అని **1954**లో వొచ్చిన ఒక తెలుగు డబ్బింగు హిందీ సినీమాపాట వస్తోంది.

"అందులో తప్పేం వుంది? మన వాడికి పాత సినీమా పాటలకంటే ఇష్టం కదా. ఆ రికార్డులన్నీ దాచి ఉంటాడు. నన్నడిగితే ఇది అతను దగ్గిరుండి పెట్టించిన పాట కాకపోయినా ఎంచి పెట్టినపాట అయివుండాలి." అన్నాను.

"పాత సినిమాల్లో పాటలు తప్పకుండా మంచివే అనుకో. అయినా, శుభమా అంటూ పెళ్లిచేస్తూ పాడు జీవితం యవ్వనం మూడునాళ్ల ముచ్చట అంటూ ఆ పాట ఎందుకు పెట్టినట్టు?"

ఇంతలో పాట ఆగింది. రికార్డు వెనక్కి తిప్పేరో, లేక మరోటి పెట్టేరో గాని "పందిట్లో పెళ్లవుతున్నది, కనువిందవుతున్నది-" అని పాడింది లౌడ్ స్పీకర్.

"ఇది కొంచెం పరవాలేదు;" అని రాజీ పడ్డాడు జగన్మోహనరావు.

"ఇదీ అదీ ఒక రికార్డులోనే ఇటూఅటూ వుండి ఉంటాయి. ఆ రికార్డు మనవాడు ఎంచి ఇస్తే వరసగా పెట్టి వుంటాడు మైక్ కంపెనీ కుర్రాడు." అని నేను సముదాయించేను.

" ఏ సందర్భంలో ఏ పాట పెట్టాలి అనేది మనవాళ్లు బొత్తిగా ఆలోచించరు బ్రదర్. మొన్న నాకరోజు ఎవరో పార్లమెంటు సీటుకి నిలబడి ఎన్నికలో గెలిస్తే సన్మానసభ పెట్టేరు. అక్కడ కొన్ని పాటలతో బాటు పెట్టారు- ఏవో చెప్పనా ?"

"ఏం పెట్టారు?"

"నందమయా, గురుడ నందామయా; ఆనందదేవికి నందామయా !

స్వారాజ్యయుద్ధాన జయభేరి మ్రోగించి

శాంతమూర్తులు అంతరించారయా,

స్వాతంత్ర్యగౌరవము సంతలో తెగనమ్మ

స్వార్థమూర్తులు అవతరించారయా !"

అనే పాట. సరిగ్గా దాని వెనకవేపునే ఉన్న పాట మరొకటి-

"శివశివమూర్తివి గణనాథా-నీవు

శివుని కుమారుడవు గణనాథా !

ఒక్కసారి మంత్రి చెయ్యి గణనాథా, నీవు

ఓడకుంటె వొట్టు పెట్టు గణనాథా! పదవి

ఊడకుంటె వొట్టు పెట్టుగణనాథా!"

పల్లవి ఒక్కటే చెప్పేసి ఊరుకోకుండా జగన్మోహనరావు ఆ పాటల్లో చరణాలు గుర్తుపెట్టుకుని ఇంచుమించు అవే వరసల్లో పాడి వినిపించేడు. గొప్ప కులాసావేసింది.

"అంతెందుకు? విజయనగరం పైడితల్లమ్మ ఉత్సవాలకి ముందరో, అనకాపల్లి నూకాలమ్మ పండగ ముందరో వేసే రికార్డులు విన్నావా?" అని అడిగాడు మళ్లీ.

"ఏదైనా భక్తిపాటల రికార్డులు వేస్తుంటారు, ఏం?"

"భక్తీలేదు శక్తీ లేదు- !

'చిలకకొట్టుడు కొడితే చిన్నదానా,

పలకమారి పోతావే, పడుచుదానా! అనే పాట ఒకటి,

"ముద్దు-పెట్టుకుంటావా,

నన్నే - పెట్టమంటావా -" అనే పాట ఒకటి - వేసేరయ్యా, ఏం చెప్పమంటావు?"

"అయ్యో, అయ్యో!" అని బాధపడ్డాను

"అవే కాదు. అంతకంటె స్పీడు పాటలు-

"పెట్టు, పెట్టు ; కొట్టు, కొట్టు!" అనే పాట కూడా నేను అమ్మవారి సంబరాల్లో వేసినప్పుడే మొదటిసారి విన్నాను."

అసలు మన ఇంట్లోనో, వీధిలోనో అట్టహాసంగా జరగవలసిన ఒక శుభ కార్యం సంభవించి నపుడు సినిమా పాటల రికార్డులు వేసి తీరాలా? సినిమా పాటల రికార్డులు వేసినప్పుడు అవి ముందస్తుగా ఒక మాటు వేసుకుని విని మరీ వెయ్యకూడదా? - ఇలాంటి పాయింట్ల మీద కాసేపు చర్చించుకున్నాం. శుభకార్యం నిర్వహించడం అనేది మనకి ఆనందం - ఈ ఆనందంలో పాల్పంచుకొమ్మని కొందరిని లోపలికిపిల్చి "మదర్పిత చందన తాంబూలాదులు" సమర్పిస్తున్నాం, అయితే ఇటూ అటూ నాలుగు వందల మీటర్ల చొప్పున వినపడే విధంగా అసలీ రికార్డుల మోత ఎందుకు? దీన్ని పబ్లిక్ న్యూసెన్స్‌గా గ్రహించి నిషేధించే అధికారం ఎవరికీ లేదా? మన శుభకార్యం ధర్మమా అని పెట్టే రికార్డుల సంగీతం పక్కయిళ్లల్లో అవతల వీధిలో చదువుకునే కుర్రాళ్ల ఏకాగ్రతని పాడుచెయ్యడం లేదా? ఈ హక్కు మనకి ఎవరిచ్చేరు? - ఇలా ఒకర్నొకరు ఎన్నో ప్రశ్నలతో వేధించుకున్నాం.

రాత్రి తొమ్మిదింపావుకి పెళ్లి. ముందుగానే భోజనాలు పెట్టేశారు. ముహూర్తం అయ్యాక పదిగంటలకి బస్సుంది; వెళిపోతానంటే జగన్మోహనరావుని బస్ కాంప్లెక్సు దగ్గర మళ్లీ నా స్కూటర్ మీద తీసుకొచ్చి దింపేను. "విజయనగరం వస్తే ఓసారి రా" అని తన ఎడ్రసులున్న కార్డు ఇచ్చేడు. "ఇదేంటి, ఎ.జె.ఎమ్. మ్యూజికల్స్ అని ఉంది?" అన్నాను.

✤ ✤ ✤

జగన్మోహనరావు పగలు ట్యుటోరియల్ కాలేజి నడుపుతూ సాయంకాలం తన సినిమాపాటల కేసెట్ల షాపులో కూర్చుంటున్నాడని ఆ మరుచటి ఆదివారం విజయనగరం వెళ్లినప్పుడు తెలిసింది.

అతని దగ్గర కేసెట్లలో పెట్టిన సినిమా పాటల విభజన చూసి చాలా సరదా వేసింది.

పెళ్లి, శివరాత్రి, శ్రీరామనవమి, సంక్రాంతి, స్వాతంత్ర్యదినం, దసరా, దీపావళి, గాంధీజయంతి, క్రిస్మస్, బిడ్డపుట్టిన రోజు, ఇలా సందర్భపడే రకరకాల శుభాలకి అనుగుణంగా గంట, తొంభైనిమిషాలు వచ్చే కాసెట్లు తయారు చేసేడు. అన్నీ తెలుగు సినీమా పాటలే. అన్నిట్లోనూ చక్కని కవిత్వం, మంచి సంగీతం ఉన్నాయి. ఆ కాసెట్లు సెట్లు సెట్లుగా ఉన్నాయక్కడ.

ముందూ వెనకా చూడకుండా ఒక సెట్టు పది కాసెట్లు కొనుక్కొచ్చేశాను.

☼

*( " ఆంధ్రభూమి " డెయిలీ : 22-6-88 )*